## స్నేహాన్ని, అభిమానాల్ని, ప్రేమను దేనితో కొలుస్తారు?
## ఆర్థిక విలువలు మానవ సంబంధాల్ని పాడు చేస్తాయా?

నవలిక

# సిరి మోహం

నందం రామారావు

## 5

కిరీటి కారు దిగి "నువ్వా రా. త్వరగానే వచ్చేద్దాంలే." అన్నాడు ప్రభాకర్‌తో.

ప్రభాకర్ కూడా కారు దిగాడు. గేటు తీసుకుని లోపలకు వచ్చారు.

అది చిన్న డాబా.

శేఖర్ తన ఇద్దరు పిల్లలతో కలిసి తోట పని చేస్తున్నాడు.

"శేఖర్!" అంటూ కిరీటి పిలిచాడు.

శేఖర్ ఇటు తిరిగి, చటుక్కున లేచి నిలబడి కిరీటి దగ్గరగా వచ్చి "మీరు..."

"మన ఫ్రెండ్ కిరీటి గుర్తులేదా?" ప్రభాకర్ అన్నాడు.

శేఖర్ క్షణం సేపు తన కళ్ళని తాను నమ్మలేకపోయాడు. కిరీటి చేతిని ఆప్యాయంగా పట్టుకుని-

"కిరీటీ! నువ్వు...నువ్వేనా? ఎంత మారిపోయావు. రా. అలా కూర్చుని మాట్లాడుకుందాం" అన్నాడు.

అది చూసి ప్రభాకర్ చిరాకు పడిపోయాడు. అక్కడ కూర్చోవడం అతనికి ఇష్టం లేదు. కిరీటిని త్వరగా తనింటికి తీసుకెళ్ళాలి. అతనితో బిజినెస్ విషయం మాట్లాడాలి. తనుకూడా అందులో షేర్ తీసుకోవాలి.

"శేఖర్! మేం అర్జంటు పనిమీద వెడుతున్నాం" అన్నాడు ప్రభాకర్.

కిరీటి, ప్రభాకర్ ఆరాటాన్ని అర్థం చేసుకున్నాడు. అదీగాక, తను శేఖర్‌తో ప్రశాంతంగా మాట్లాడాలి.

"అవునురా శేఖర్! నేను రేపు ఉదయం మీ ఇంటికొస్తాను" అన్నాడు కిరీటి.

"తప్పకుండా వస్తావా?"

"ఆ నీకోసం కాదు. నాకోసం వస్తాను" అన్నాడు నవ్వుతూ.

ఇద్దరూ బయటకొచ్చి కారులో కూర్చున్నారు.

శేఖర్ గేటు వరకూ వచ్చాడు.

కారు ప్రభాకర్ ఇంటివేపు సాగిపోయింది.

** ** **

ప్రభాకర్, భార్య వనజనీ, కూతురు ఉషనీ కిరీటికి పరిచయం చేశాడు.

నౌకర్ తెచ్చిన కూల్ డ్రింక్స్ త్రాగాక, ప్రభాకర్ అసలు విషయంలోకి వచ్చాడు.

"కిరీటీ! నీ వ్యాపారంలో నేను పార్ట్‌నర్‌గా చేరతారా. నీకేమన్నా అభ్యంతరమా?"

"నాకా. అబ్బే లేదు"

"ఆహా. అదికాదు. ఎవరికైనా మాటిచ్చావేమోనని."

ప్రభాకర్, శశాంకని దృష్టిలో పెట్టుకుని అంటున్నాడని గ్రహించిన కిరీటి- "ఎవరికీ మాటివ్వలేదు." అన్నాడు.

ఆ మాట వినడంతోనే ప్రభాకర్ ముఖం విప్పారింది.

"శశాంక అడుగుతాడేమో, పోనీ ఇద్దరికీ యిస్తాను" అన్నాడు ప్రభాకర్ ముఖంలోకి చూస్తూ కిరీటి.

ప్రభాకర్ ముఖంలో రంగులు మారాయి.

"కిరీటీ! నన్ను చేర్చుకోకపోయినా ఫర్వాలేదు. ఆ శశాంకగాడిని మాత్రం చేర్చుకోకు. వాడొట్టి స్వార్థపరుడు. నిన్ను నిలువునా ముంచేస్తాడు"

ప్రభాకర్ మాటలు వింటుంటే పగలబడి నవ్వాలనిపించింది కిరీటికి. పైకి చూడబోతే ఇద్దరూ గాఢ స్నేహితులు. కానీ, లోపలంతా కుత్సితమే. ఒకరంటే ఒకరికి పడదు. ఒకరిని మించి మరొకరు డబ్బు సంపాదించాలనే కాంక్ష. ఆ డబ్బుకోసం ఏ గడ్డినైనా కరవడానికి సిద్ధమవుతారు. ఏం మనుషులు వీళ్ళు!

కిరీటి! ఏమంటావురా?" ఆశగా అతని ముఖంలోకి చూశాడు ప్రభాకర్.

"నీకే ఇస్తాలే."

ప్రభాకర్ సంతోషంతో పొంగిపోయాడు.

"కిరీటీ! ఒక్కమాట. నేను యాభై లక్షలు పెట్టలేను. అంత డబ్బు నా దగ్గర లేదు.

"అదేమిట్రా. ఇంత బిజినెస్ చేస్తున్నావ్. ఆ మాత్రం డబ్బు లేదా?"

ప్రభాకర్ క్షణం వూరుకుని అన్నాడు. "కిరీటీ! నిజంగా నా దగ్గర అంత డబ్బు లేదు. ఈ మధ్య అంతగా లాభాలు రావడం లేదు. నా దగ్గర వున్న క్యాషంతా కలిపి పది లక్షలవుతుంది. అదే పెట్టుబడి పెడతాను."

"సరే చూద్దాం"

"అలా అంటే కాదురా కిరీటీ! నువ్వు నన్ను పార్ట్‌నర్‌గా చేర్చుకోవాలి. లేకపోతే నేను చాలా దెబ్బతింటాను. కాస్త నన్ను ఆదుకోరా కిరీటీ! ప్లీజ్!"


"సరే."

"కిరీటీ! ఆ మాట చాలు." తృప్తిపడ్డాడు ప్రభాకర్.

"ప్రభా! పది లక్షలూ రేపు ఇవ్వు. నేను బోంబే వెళ్ళగానే మెటీరియల్ కొంటాను."

"అలాగే."

"నా దగ్గరున్న అయిదు లక్షలు నీకిస్తాను. నీ దగ్గరుంచు. మన బిజినెస్‌కు మంచి బిల్డింగ్ కావాలిగదా! మంచి స్థలం కానీ, బిల్డింగ్ కానీ అమ్మకానికొస్తే కొనెయ్. నేను మెటీరియల్ కొని పంపిస్తాను. ప్రస్తుతానికి మీ గోడవున్లో వుంచు" అన్నాడు కిరీటి.



ప్రభాకర్ తన బిజినెస్ పెట్టినప్పటినుంచీ తనకొచ్చిన లాభ నష్టాలగురించి కిరీటికి చెప్పాడు. చెప్పి-

"కిరీటీ! నీ బిజినెస్‌తో మళ్ళా నేను పుంజుకోవాలి. అన్నట్టు ఈ విషయం శశాంకకు చెప్పకు" అన్నాడు.

కిరీటి నవ్వాడు.

"మీ రిద్దరూ బలే స్నేహితులురా ప్రభా! అయినా మిమ్మల్నననడం దేనికి? మిమ్మల్నిలా ఆడిస్తున్న ఆ ధనాన్ని మెచ్చుకోవాలి. ఓ ధనమా! నీకు జోహార్!" అన్నాడు కిరీటి.

ప్రభాకర్‌కి అతని మాటలు అర్థం కాలేదు.

ఇంతలో నౌకర్ వొచ్చి భోజనానికి పిలిచాడు. ప్రభాకర్, కిరీటి లోపలకెళ్ళి భోజనం చేశారు. ప్రభాకర్, కిరీటికి మేడమీది తన ఏ.సి. రూమ్ ఇచ్చి-

"కిరీటీ! ఏం కావాలన్నా ఈ బెల్ నొక్కు" అని చెప్పి వెళ్ళిపోయాడు.

ప్రభాకర్ వెళ్ళిపోయిన కాసేపటికి తలుపు తెరచుకున్న చప్పుడయింది.

కిరీటి వులిక్కిపడ్డాడు.

తలుపు తెరుచుకుని ప్రభాకర్ కూతురు ఉష లోపలకొచ్చింది. అది చూసిన కిరీటికి రాత్రి సంఘటన జ్ఞాపకం వచ్చి వణికిపోయాడు. ఉష కిరీటి ఎదురుగా వున్న సోఫాలో కూర్చుంది. కిరీటి ఆమెవేపు చూశాడు. నీలిరంగు పరికిణీ, జాకెట్టు, పైన తెల్లటి నైలెక్స్ ఓణీ వేసుకుంది. ముఖంలో అమాయకత్వం, పసితనం వీడని ఛాయలు కనిపిస్తున్నాయి.

"ఉషా! ఎందుకిలా వచ్చావ్?" కిరీటి మెల్లగా అడిగాడు.

"మీతో మాట్లాడాలని."

"నాతోనా?"

"మరండీ! మీకు బాగా డబ్బు వుందా?"

"ఆ!"

"బంగ్లా వుందా? ఎన్ని కార్లు వున్నాయి? పది వుంటాయా?"

ఆ ప్రశ్నలకు నవ్వుకుని "ఆ వున్నాయి." అన్నాడు కిరీటి.

"మనం హనీమూన్‌కి ఫారిన్ వెడదామా?"

కిరీటి తెల్లబోయాడు.

"హనీమూనా?" అన్నాడు.

"అవునండీ! మనిద్దరికీ పెళ్ళి అవుతుందిగా!"

"ఎవరన్నారు?"

"మా అమ్మా! నాన్న చెప్పారు."

ఆ మాట వినడంతోనే కిరీటికి ఎక్కడలేని కోపం వచ్చింది.

"ప్రభాకర్! నువ్విటువంటి నీచానికి దిగజారుతావనుకోలేదురా. ముక్కు పచ్చలారని పదహారేళ్ల ఈ పిల్లకీ, నాకూ పెళ్ళా? డబ్బుకోసం కన్న కూతురిని కూడా బలి పశువుగా చేస్తావా? నువ్వు మనిషివా? రాక్షసుడివా?'

"ఏవండీ! మీకు నేను నచ్చానా?" అమాయకంగా అడుగుతోంది ఉష.

కిరీటికి ఆ పిల్లమీద జాలి కలిగింది. ముందుకు జరిగి ఆ పిల్ల చెయ్యి పట్టుకుని-

"చూడమ్మా ఉషా! మీ నాన్నా నేనూ ఒకే వయసు వాళ్ళం. అంటే నువ్వు నాకూతురివన్నమాట. నన్ను బాబాయ్ అని పిలవాలి. అదీగాక నువ్వింకా చిన్నపిల్లవమ్మా...ఇప్పటినుంచే పెళ్ళీ, మొగుడూ అనే ఆలోచనలు పెట్టుకో కూడదు. బాగా చదువుకోవాలి. నీకాళ్ళమీద నువ్వు నిలబడాలి. అప్పుడు నీ మనసుకు నచ్చిన వాడిని పెళ్లి చేసుకో. అంతేకానీ నాలాటి వాడిని కాదమ్మా చేసుకోవలసింది. జీవితంలో డబ్బే ప్రధానం కాదమ్మా. డబ్బు ఈరోజు వుంటుంది, రేపు పోతుంది. అనుబంధాలూ, ప్రేమలూ మాత్రమే శాశ్వతంగా వుండిపోతాయి" అన్నాడు కిరీటి.

ఉష తలొంచుకుంది.

"ఉషా! వెళ్ళమ్మా! బాగా చదువుకో. ఏది మంచో, ఏది చెడో తెలుసుకో. స్వంతంగా ఆలోచించడం అలవరుచుకో. వ్యామోహంకు లొంగిపోకు, ఇదేనమ్మా ఇంతకాలం ఈ బాబాయ్ తెలుసుకున్న జీవిత సత్యం."

ఉష కళ్ళలో నీళ్లు తిరిగాయి.

"బాబాయ్!" అంది గాద్గదికంగా.

"వెళ్ళు ఉషా! మీ అమ్మా నాన్నలాగా డబ్బుకెప్పుడూ లొంగిపోకు. మనుషుల్ని రాక్షసులుగా మారుస్తూ, ప్రేమాభిమానాల్ని చంపేస్తుంది ఈ డబ్బు. మీ అమ్మా నాన్నమాట వినకుండా, మానవత్వమున్న మనిషిలా బతుకు తల్లీ!"

ఉష బాబాయ్‌కేసి జాలిగా చూసి నెమ్మదిగా వెళ్ళిపోయింది.

కిరీటి సోఫాలో వెనక్కి వాలాడు. అతని మనస్సంతా వికలమై పోయింది. కళ్ళు మూసుకుని ఆలోచిస్తూ వుండిపోయాడు.

అప్రయత్నంగా అతని కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి.

* * * *

"కిరీటీ! చాలా టైమయింది. ఇక లేస్తావా?"

"నువ్వెళ్ళు. నేను వొస్తాను" అన్నాడు కిరీటి కళ్ళు విప్పకుండానే. లేవగానే ప్రభాకర్ ముఖం చూడ్డం ఇష్టంలేదు కిరీటికి.

కిరీటి స్నానం చేసి, డ్రెస్ చేసుకుని టిఫిన్ తింటుంటే సుధ ఫోన్‌చేసి-

"మధ్యాహ్నం మా ఇంటికి భోజనానికి రావాలి!" అని చెప్పింది.

"అలాగే" అని ఫోన్ పెట్టేశాడు కిరీటి.- కాఫీతాగి "నేను వెళ్ళొస్తారా ప్రభా!" అన్నాడు.

"సరే!"

కిరీటి వనజను పిలిచి "ఉష ఏది?" అని అడిగాడు.

"ఇవేళ ఏం బుద్ధి పుట్టిందో ప్రొద్దున్నే లేచి తయారయి కాలేజీకి వెళ్ళింది" అన్నాడు ప్రభాకర్.

కిరీటికి సంతోషం కలిగింది.

"ఉషా! యూ ఆర్ ఎ గుడ్ గరల్! అనుకున్నాడు మనసులో.

"వెళ్ళొస్తాను" అని కారులో కూర్చున్నాడు. కారు శేఖర్ ఇంటిముందు ఆగింది. శేఖర్ కిరీటి కోసమే ఎదురు చూస్తూ కూర్చున్నాడు.

"రా కిరీటీ!" అంటూ ఆప్యాయంగా ఆహ్వానించాడు. కిరీటి శేఖర్‌తో కలిసి లోపలికొచ్చాడు. ఇల్లు శుభ్రంగా, చూడ ముచ్చటగా వుంది.

"కూర్చో కిరీటీ! మా ఇంట్లో ఈ కుర్చీలు తప్ప సోఫాలు లేవు!"

"సోఫాలకంటే ఇవే బావుంటాయి. ఆ సోఫాల్లో కూర్చుంటే నా శరీరమే సుఖపడుతుంది. కానీ ఇవి నా మనస్సుకి కూడా శాంతిని కలిగిస్తాయి."

"కిరీటీ! నువ్వు గనుక రచనలు చేస్తే తప్పకుండా పెద్ద రచయిత అయ్యే వాడివి."

"శేఖర్! నా జీవితమే ఒక పెద్ద కథ"

"వుండు కాఫీ తెస్తాను" అంటూ శేఖర్ లేవబోయాడు. కిరీటి, అతని చెయ్యి పుచ్చుకుని ఆపి—

"ఇప్పుడేం వొద్దురా" అన్నాడు.

"నువ్వు ప్రొద్దున్నే వస్తావని నీ కిష్టమైన పెసరట్లు చేయించాను. నువ్వు తినకపోతే వూరుకునేది లేదు"

"ఇప్పుడేం తినాలని లేదురా!"

"పోనీ, ఒక్కటి తిను. మా తృప్తికోసం." అని శేఖర్ లోపలికెళ్ళాడు.

కిరీటి గోడకున్న పెయింటింగ్స్ చూస్తూ కూర్చున్నాడు. క్షణం తర్వాత గాజుల గలగల వినిపిస్తే తల తిప్పి చూశాడు కిరీటి.

"కిరీటీ! ఈమె నా భార్య లలిత!" శేఖర్ పరస్పరం పరిచయం చేశాడు.

"శేఖర్! ఈ పెయింటింగ్స్ బావున్నాయి. ఎక్కడ కొన్నావ్?"

"కొనలేదు. అవన్నీ మా శ్రీమతి గారి కళా ఖండాలు" అంటూ టిఫిన్ ప్లేటు కిరీటికి అందించాడు.

"నిజమా?"

"ఆవిడే ఎదురుగా వుంది కదా! అడుగు."

కిరీటి లలితవైపు చూసి-"చాలా బావున్నాయండీ!" అన్నాడు.

ఆమె కృతజ్ఞతగా నవ్వింది.

"ఇవే కాదురా, ఆవిడకు రాని విద్యే లేదనుకో. కుట్లూ, అల్లికలూ, సంగీతం అన్నిటిలోనూ ప్రవీణురాలే. ఒక్క రచనలో తప్ప" అంటూ భార్యవేపు ప్రేమగా చూశాడు శేఖర్.

"చాల్లెండి...నన్నేం వెక్కిరించనక్కర్లేదు."

"వెక్కిరించడం కాదోయ్, మెచ్చుకోవడం. పోనీ, నువ్వు చెప్పరా కిరీటీ!"

"మీ ఇల్లొక కళా నిలయం" అన్నాడు కిరీటి నవ్వుతూ.

ఈ లోపల లలిత లోపలకెళ్ళి కాఫీ తెచ్చి కిరీటికిచ్చింది. కిరీటి కాఫీ తాగిన తర్వాత ప్లేటు, కప్పు తీసుకుని లోపల కెళ్ళింది. శేఖర్ కిరీటికెదురుగా

# చేతనాస్తిత్వం

అక్షర ఖచిత భాషగా
ఘోష సహిత జిగీషగా
నిప్పు పువ్వులా కుంకుమ నవ్వులా
ఘనీభవించిన సంధ్యాకాశంలో ప్రమాద దీపంలా
చరిత్ర చిటారు కొమ్మన వికసించిన మోదుగు శ్రీదంలా
ఫెళ ఫెళ తళ తళ స్రవంతి ఘాతంలా
నిరాయుధత్వంలోంచి సల సలకాగే సాయుధత్వంలోకి
అనంత సజీవ సశేష యాత్రా వాహినీ నిరంతరత్వంలోకి
నీ, నా అస్తిత్వం చైతన్యమై భూకంపమై
అస్తమయం లోంచి ఆకారంలోకి దృశ్యమై
జారుడు బండల మీంచి సెలయేటిలోకి
స్వస్థతలోకి స్వచ్ఛతలోకి స్పష్టత లోకి
సందోహంలోకి సంఘర్షణలోకి సమర్పణంగా
స్రవించాలి క్రమించాలి జ్వలించాలి.

-త్రిపురనేని శ్రీనివాస్

కూర్చున్నాడు.

"శేఖర్! నువ్వు మా కుటుంబానికి చేసిన సహాయానికి చాలా కృతజ్ఞతలు. నువ్వే గనుక ఆదుకోకపోతే మా చెల్లెలు జీవితం ఏమైపోయేదో?"

"కిరీటీ! అలా అనకు. మనలో మనకు కృతజ్ఞతలేమిటి? ఇంతకీ బొంబే విశేషాలేమిటి?" అంటూ శేఖర్ మాట మార్చాడు.

"ఏవుందిరా? నువ్వింతవాడివైనందుకు చాలా ఆనందంగా వుంది."

కిరీటి మాట్లాడలేదు.

"కిరీటీ! బీదవాడు హటాత్తుగా గొప్పవాడయ్యాడని కథల్లో చదివినప్పుడు, అవన్నీ సామాజిక స్పృహలేని రచనలని విమర్శించేవాడిని. నిన్ను చూస్తుంటే అవన్నీ నిజాలనిపిస్తోంది. యువకులందరూ నిన్ను ఆదర్శంగా తీసుకుని నీలా శ్రమిస్తే ఎంత బాగుంటుంది?"

కిరీటికి ఆ మాటలు రుచించడం లేదు.

"శేఖర్. పొగడ్తలు ఆపి ఏమన్నా కబుర్లు చెప్పు. మన క్లాస్‌మేట్స్ ఇంకా ఎవరెవరు ఎక్కడెక్కడున్నారు?"

శేఖర్ తనకు తెలిసిన వాళ్ళ గురించి చెప్పి-"అన్నట్టు కిరీటీ! మీ అమ్మ, నాన్నగారూ బాగున్నారా?" అనడిగాడు.

"ఆ వాళ్ళిప్పుడు తమ్ముడి దగ్గర వుంటున్నారు. నేను వాళ్ళని చూసి ఏడాది కావస్తోంది"

"కిరీటీ! మీవాళ్ళందరూ జీవితాల్లో స్థిరపడ్డారు కదా! ఇక నీకు బాధ్యతలేమీ లేవు కదూ?"

"శేఖర్! నేను కోరుకున్న వన్నీ సాధించాను. ఇంక నేనేమైపోయినా ఫర్వాలేదు" అన్నాడు కిరీటి ఎటో చూస్తూ.

"అదేవిట్రోయ్ అప్పుడే వైరాగ్యం. నువ్వు అనుభవించాల్సిందంతా ముందే వుంది. నువ్వు పెళ్ళి చేసుకోవాలి. తండ్రివి కావాలి. కిరీటీ! జీవితంలోని మాధుర్యమంతా కుటుంబ వ్యవస్థలోనే వుంది. ఎవరైనా అమ్మాయిని చూడమంటావా? చెప్పు క్షణాల్లో కుదురుస్తాను"

"ఈ అమ్మాయిల బిజినెస్ ఎప్పటినుంచిరా?" అంటూ కిరీటి నవ్వాడు.

"నీకోసం ఇక ప్రారంభించాలి."

"ఊఁ కానియ్. చాలా లాభసాటి వ్యాపారంలే. లాభాల్లో నాకూ సగం వాటా ఇవ్వాలి."

"నీ వ్యాపారబుద్ధి ఇక్కడ కూడా పోనిచ్చుకున్నావు కాదు." అన్నాడు శేఖర్. ఇద్దరూ నవ్వుకున్నారు.

ఇంతలో లోపలినుంచి లలిత వచ్చి భోజనానికి పిలిచింది. అప్పుడే జ్ఞాపకం వొచ్చింది కిరీటికి సుధ భోజనానికి పిలిచిన విషయం. శేఖర్‌కి ఆ విషయం చెప్పాడు. కానీ, శేఖర్ ఒప్పుకోలేదు.

"సుధ ఇంటికి రాత్రి వెళ్ళొచ్చులే. నువ్వీపూట ఇక్కడ వుండాల్సిందే. లేకపోతే నామీద ఒట్టే." అన్నాడు శేఖర్.

కిరీటికి కూడా ఇక్కడే వుండాలని వుంది. ఇప్పుడు సుధ దగ్గరకు వెళ్ళి, ఆమె చెప్పే మాటల్ని వినే స్థితిలో లేడు. శేఖర్ మాట కాదనలేక "సరే కానియ్" అన్నాడు కిరీటి.

ఇద్దరూ లోపలికి వెళ్ళారు.

కిరీటి సూట్ విప్పి, శేఖర్ యిచ్చిన పంచె కట్టుకున్నాడు. ఇద్దరూ డైనింగ్ టేబుల్ ముందు కూర్చున్నారు.

"కిరీటీ! అన్నీ తెలుగు వంటకాలే. ఇవి ఇప్పుడు నీకు నచ్చుతాయో లేదో!"


"కిరీటి టేబుల్‌కేసి చూశాడు. పప్పు, ఆవకాయ, వంకాయ, గోంగూర పచ్చడి, కారివికారం. వాటిని చూడగానే కిరీటికి నోరూరింది.

"అబ్బ! ఎన్నాళ్ళయింది వీటిని తిని?" అంటూ గోంగూర పచ్చడి కలిపాడు.

కిరీటి ఆ రోజు తృప్తిగా భోజనం చేశాడు. భోజనమయ్యాక, ఇద్దరూ శేఖర్ గదిలో కూర్చున్నారు.

"శేఖర్! నీ పేరు రచయితగా బొంబేలో కూడా మోగిపోతోంది."

బహుమతి పొందిన కార్టూన్ స్ట్రిప్




ఆ మాటకి శేఖర్ చిన్నగా నవ్వి వూరుకున్నాడు.

"శేఖర్! నీ రచనలు చూపించు."

శేఖర్ ప్రింటయిన తన పుస్తకాలు, కథలున్న ఫైలు తెచ్చి కిరీటికిచ్చాడు. కిరీటి వాటిని చదువుతూ కూర్చున్నాడు. మూడు గంటలకు లలిత టీ తెచ్చే వరకు కిరీటి ఈ లోకాన్ని మరచి పూర్తిగా సాహిత్య లోకంలో మునిగిపోయాడు.

"శేఖర్! నీ కథలు చాలా బావున్నాయిరా!" అన్నాడు టీ తాగుతూ.

"ఆనాడు నువ్వు కాదన్నావుగానీ, కృషి చేస్తే నువ్వు గొప్ప రచయితవి అయ్యేవాడివి."

"కాకపోవడమే మంచిదయింది."

"అవును. నీకేం తక్కువ. నాలాటి రచయితల్ని వందమందిని పోషించగలవు."

కిరీటి నవ్వి వూరుకున్నాడు. మరోసారి టీ త్రాగి, ముఖం కడుక్కుని బయలుదేరాడు.

"అప్పుడే వెడతావా? కాస్సేపుండకూడదు? అసలు నీతో మాట్లాడినట్టే లేదు." శేఖర్ బాధగా అన్నాడు.

"మరోసారొస్తాలేరా"

"ఎప్పుడు?"

కిరీటి సమాధానం చెప్పలేదు.

"బొంబే వెడితే ఇక మేం జ్ఞాపకం వుండంనీకు. నాలుగు రోజులు మా ఇంట్లో వుండరా. మాకున్నంతలో నీకేలోపము చెయ్యం."

ఆ మాటకి కిరీటి నొచ్చుకుని-

"ఛ! అవేం మాటల్రా. ఇంతేనా నన్నర్థం చేసుకుంది" అన్నాడు.

"పోనీ ఒక్క రోజు వుండరా"

"కుదరదురా. బొంబేలో అర్జెంటు పని వుంది. వెళ్ళాలి. ప్లీజ్ బలవంతం చెయ్యకు. మళ్ళా వస్తానుగదా!"

## నీలిమేఘం

శేఖర్ ఇక ఏం మాట్లాడలేకపోయాడు. లలితతో కిరీటి చెప్పి బయటకొచ్చిం తర్వాత-

''శేఖర్! రేపు ఉదయం ఫ్లైట్‌కి బొంబే వెడుతున్నాను'' అన్నాడు.

''కిరీటీ! అప్పుడప్పుడూ లెటర్స్ రాస్తూ వుండు.''

''అలాగే. వెళ్ళగానే నీకో పెద్ద లెటర్ రాస్తాను. సరేనా?''

''రేపు ఉదయం ఏరోడ్రోమ్‌కి నేనూ వస్తాను.''

''అలాగే. ఇకనేను వెళ్ళొస్తారా శేఖర్!''

''కిరీటీ...''

''శేఖర్! నాకోసం బాధపడే స్నేహితుడొకడున్నాడు. నాకీ తృప్తి చాలు.''

''శేఖర్! నీలాంటి స్నేహితుడిని పొందిన నేనెంతో అదృష్టవంతుడిని. మళ్ళీ మనం కలుసుకుని హాయిగా మాట్లాడుకునే అవకాశం ఆ భగవంతుడు మనకి కలిగిస్తాడో లేదో...''

''అవేం మాటల్రా. నువ్వు రాకపోతే బొంబే నీకోసం నేను వస్తాను. మళ్ళీ మనం తప్పకుండా కలుసుకుంటాం.''

కిరీటి నవ్వాడు. నవ్వి-''వెళ్ళొస్తా శేఖర్'' అంటూ రోడ్డుమీద పోతున్న టాక్సీని పిలిచి దాన్లో కూర్చున్నాడు.

ఆ సమయంలో ఇక ఎవ్వరింటికీ వెళ్ళాలని పించలేదు అతనికి. ఆ టాక్సీలోనే రాత్రి ఎనిమిది గంటల వరకూ వూరంతా తిరుగుతూ గడిపాడు. ఎనిమిది దాటాక శశాంక ఇంటిముందు టాక్సీ దిగాడు. కిరీటి లోపలికెళ్ళేసరికి శశాంక, ప్రభాకర్, సుధ అతని కోసం ఎదురుచూస్తూ కన్పించారు.

''కిరీటీ! ఇంతవరకూ ఎక్కడున్నావ్?'' శశాంక అడిగాడు.

''మా బిజినెస్ పార్ట్‌నర్ కనిపిస్తే అతనితో వున్నాను.''

''అలా కూర్చో కిరీటీ! బాగా అలిసిపోయినట్టున్నావ్.'' అంది సుధ.

''లేదు. చిరాగ్గా వుంది. స్నానం చెయ్యాలి'' అంటూ మేడపైకి వెళ్ళాడు. అతను స్నానం చేసి వచ్చేసరికి గంటపైన అయింది.

హాల్లో సుధ, ప్రభాకర్ మాత్రమే వున్నారు.

''శశాంక ఏడీ?'' సోఫాలో కూర్చుంటూ అడిగాడు కిరీటి.

''ఆఫీసు మేనేజరు వచ్చాడు. అతనితో కలిసి ఎక్కడికో వెళ్ళాడు.

''సారీ సుధా! మీ ఇంటికి రాలేకపోయాను.''

''సారీ అనగానే సరిపోయిందా? నీకోసం ఎంత సేపు ఎదురుచూశానో''

''మళ్ళా వొస్తానుగదా! ఈ సారి మీ ఇంట్లోనే దిగుతాను. అప్పుడు నువ్వు పొమ్మనే వరకూ వుంటాను. సరేనా?'' అన్నాడు.

''నిజంగానా?''

''ష్యూర్!''

''ఇక నేను వెళ్ళొస్తాను కిరీటీ! పదవుతోంది'' అంది సుధ.

''అలాగే''

''రేపు ఉదయమే కదా నువ్వు వెళ్ళేది!'' సుధ అడిగింది.

''అవును''

సుధ మరోసారి వాళ్ళిద్దరికీ చెప్పి వెళ్ళిపోయింది.

''ప్రభా! పైకి వెడదాం రా'' అన్నాడు కిరీటి.

ఇద్దరూ మేడమీదకొచ్చారు. ప్రభాకర్ తన దగ్గరున్న బ్రీఫ్‌కేస్‌లోంచి పది లక్షలు తీసి కిరీటికి ఇచ్చి-

''కిరీటీ! నాకున్నదంతా నీ చేతిలో పెడ్తున్నారా. ఇది పోతే నేను వీధుల్లో అడుక్కు తినాలి.'' అన్నాడు.

''ఏరా. నా బిజినెస్ మీద నమ్మకం లేదా?''

''ఛ! అదేం కాదురా. నా మనసులోని బాధ నీకు చెప్పకున్నానంతే.''

కిరీటి, ప్రభాకర్ భుజం మీద చెయ్యివేసి-

''ప్రభా! నేను శత్రువులకు శత్రువును, మిత్రులకు మిత్రుడను. నువ్వేం దిగులు పడకురా'' అన్నాడు.

ఆ మాటలు విన్నాక ప్రభాకర్‌కి స్తిమితం చిక్కింది.

''ప్రభా! ఇవిగోరా ఐదు లక్షలు.'' సూట్‌కేస్ అందించాడు కిరీటి.


కిరీటి డబ్బు ఇస్తాడో ఇవ్వడో అని ఇందాకట్నుంచీ ఆందోళన పడుతున్న ప్రభాకర్ హాయిగా నిట్టూర్చాడు.


''ప్రభా! వీటిని అవసరానికి ఖర్చుపెట్టు''

''సరే. ఇక నేను వెళ్ళొస్తారా. శశాంక వస్తాడేమో?''

కిరీటి నవ్వుతూ—''అలాగే వెళ్ళిరా'' అన్నాడు. ప్రభాకర్ వెళ్ళిపోయాడు. కిరీటి సోఫాలో కూర్చుని సిగార్ వెలిగించాడు. శశాంక వొచ్చి పిలిచే వరకూ ఏదో ఆలోచిస్తూ అలాగే కూర్చుండిపోయాడు.

* * * *






## నీలిమేఘం

బోంబే వెళ్ళే ప్లేన్ ఇంకొద్ది నిముషాల్లో బయలు దేరనున్నట్లు ఎనౌన్స్‌మెంటు వినిపించింది.

అదివిని కిరీటి ''వెళ్ళొస్తాను'' అన్నాడు అందరివేపు చూస్తూ. అతని చుట్టూ శశాంక, మాలతి, రేఖ, ప్రభాకర్, అతని భార్య, కూతురు ఉష, సుధ, శేఖర్, లలిత నిలబడి వున్నారు.

కిరీటి అందరివైపు మరోసారి చూశాడు. వాళ్ళందరూ అతని వేపు విచారంగా చూస్తున్నారు. అందరి ముఖాల్లోనూ కిరీటి వెళ్ళిపోతున్నాడనే బాధ కనిపిస్తోంది.

''కిరీటీ! మళ్ళీ ఎప్పుడొస్తావురా?'' శశాంక అడిగాడు.

''త్వరలోనే రావాలిరా!'' అన్నాడు ప్రభాకర్.

వాళ్ళ మాటల్లో తనమీద ఆప్యాయత కంటే, తను త్వరగా వచ్చి, త్వరగా వ్యాపారాన్ని పెట్టాలనే ఆరాటం కనిపిస్తోంది. అది గమనించి కిరీటి నవ్వుకున్నాడు. నవ్వుకుని-

''త్వరలోనే వొస్తాను'' అన్నాడు.

''కిరీటీ! నీతో సరిగ్గా మాట్లాడలేదు'' అంది సుధ.

సుధ మాట్లాడితే ఏం మాట్లాడుతుందో కిరీటికి తెలుసు. అందుకే, ఆమె నుంచి తప్పించుకోవడానికే నిన్నంతా వూరంతా తిరిగాడు.

''మళ్ళా వస్తానుగదా సుధా! అప్పుడు తీరుబడిగా మనిద్దరం మాట్లాడుకుందాం''

మళ్ళా ఎనౌన్స్‌మెంట్ వినిపించింది.

కిరీటి అందరితోనూ వెళ్ళొస్తానని చెప్పి, రేఖవేపు చూశాడు. రేఖ కళ్ళు ఎర్ర మందారాల్లా వున్నాయి. ఆమె పెదవులు ఏదో చెప్పాలని ఆరాటపడుతూ సన్నగా వణుకుతున్నాయి.

ఆమెని చూడగానే, రాత్రి పదకొండు గంటల సమయంలో రేఖ తన గదిలోకొచ్చి, తనతో చెప్పిన మాటలు గుర్తుకొచ్చాయి కిరీటికి. శరీరమంతా అదో విధమైన తీయని అనుభూతితో నిండిపోయింది. అణువణువూ పులకించిపోయింది.

మనసు మళ్ళా రాత్రి సంఘటన తలచుకోబోయింది. కానీ ఇంతలో-

''కిరీటీ! నీ ఫోన్ నెంబరు ఎంతరా!'' అనడిగాడు ప్రభాకర్.

కిరీటి అతని మాటకి చిరాకుపడుతూ ''వెళ్ళగానే ఫోన్ చేస్తాలే'' అన్నాడు.

''కిరీటీ! అందరూ వెళ్ళి ప్లేన్ ఎక్కుతున్నారు'' శశాంక అన్నాడు.

తెలుగు నవలా రంగంలో మొట్ట మొదటగా మల్లాది నవల "మిస్టర్-వి" మీద ప్రత్యేక రేడియో కార్యక్రమం 30-6-86 ఉదయం వివిధ భారతిలో వినండి!

హలో! హలో! "పజిల్"

విత్తనం చల్లకుండా మొలిచేది ఏది?
(ఈ ప్రశ్నకు సమాధానం చెప్పలేకపోతే మిమ్మల్నెవరూ వురి తియ్యరు.)
అయినా తమాషా సమాధానం కోసం ఆలోచించండి. లేదా ఆఖరి లైన్‌ను చూడండి!

ఈ లోగా......
ఆంధ్రుల ఆహ్లాద రచయిత
మల్లాది వెంకట కృష్ణమూర్తి
తెలుగు పాత్రలతో.. తెలుగు వాతావరణంతో..
ఏ అన్యదేశభాష నవలతో పోల్చబడకుండా రాసిన నవల
మిస్టర్ "వి" — వెల: రూ. 30/-
(తెలుగు చిత్రకారుడు రూపొందించిన గెటప్‌తో)
జూలై 1న విడుదల!
* నేడే అడ్వాన్స్‌తో పాటు మీ ఆర్డరును పంపండి!

శ్రీ మహాలక్ష్మి బుక్ ఎంటర్‌ప్రైజెస్
మ్యూజియం రోడ్, విజయవాడ-2, ఫోన్: 63322

సమాధానం: „ఉల్లిపాయ„

వనితా జ్యోతి
సచిత్ర మాసపత్రిక
వనితాభ్యుదయానికి అత్యున్నత రాజపథం 'వనితాజ్యోతి' నెలనెలా పఠనం





వనితల మనోభావాలను ప్రతిబింబిస్తూ మిమ్మలరిస్తున్న ఉత్తమ శ్రేణి పత్రిక

"వస్తారా శేఖర్!" అందర్నీ కలియ చూస్తున్న కిరీటి చూపులు మళ్ళీ రేఖ దగ్గర ఆగిపోయాయి.

"వెళ్ళొస్తా రేఖా" ఆమెకే వినిపించేంత చిన్నగా అని మరుక్షణం ప్లేన్‌వేపు చకచకా నడిచాడు కిరీటి.

వెళ్ళిపోతున్న అతని వేపు రెండు కళ్ళు ఆరాటంగా, ఆవేదనగా చూస్తున్నాయి.

అవి రేఖ కళ్ళని కిరీటి కొక్కడికే తెలుసు!

* * * *

డియర్ శేఖర్,

ఎవరా అని ఆశ్చర్యపోతున్నావా? నేనురా కిరీటిని. ఇంటికి వెళ్ళగానే నీకు పెద్ద ఉత్తరం వ్రాస్తానన్నాను. కానీ, అంతవరకూ ఆగలేక, ఆగితే నీకు ఉత్తరం వ్రాసే అవకాశం వుంటుందో లేదోనని ప్లేన్ దిగగానే లాంజ్‌లో కూర్చుని ఈ ఉత్తరం వ్రాస్తున్నాను.

శేఖర్! మాదెంత పేద కుటుంబమో నీకు తెలుసు. చదువుకునే రోజుల్లో ఆకలిగానీ, దారిద్ర్యంగానీ తెలియవు. కాలేజీ, పుస్తకాలూ, స్నేహితులూ వీటిమధ్య రోజులు క్షణాల్లా గడిచిపోతాయి. ఎక్కడ చూసినా వుత్సాహం, ఆనందం తప్ప కన్నీళ్ళు, కష్టాలు ఎరుగని జీవితం. ఆ రోజులు, ఆ కాలేజీ రోజులు శాశ్వతంగా వుండిపోతే ఎంత బాగుండును. కానీ, కాలం ఎవరికోసమూ ఆగదు. పరిగెడుతూ వుంటుందిగదా!

మధురమైన ఆ రోజులు గతించిపోయాయి. బాధలూ, కన్నీళ్ళూ తెలిసొచ్చాయి. జీవితం అంటే ఏమిటో అనుభవంలోకి వచ్చింది. నాకు ఒక్కసారిగా స్వర్గాన్నుంచి నరకానికి వచ్చినట్లయింది.

శేఖర్! ఇదంతా నేనెందుకు రాస్తున్నానని అనుకుంటున్నావా? ఇన్నాళ్ళు నాగుండెల్లో దాచుకున్న బాధంతా నీకు చెప్పాలని వుందిరా. ఈ ప్రపంచంలో నీకంటే ఆప్తులు నాకెవ్వరూ లేరు. అందుకే చెప్తున్నా. దయచేసి పూర్తిగా చదువు.

నా డిగ్రీ పూర్తయి ఇంటికి వెళ్ళగానే నాకెన్నో భయంకరమైన విషయాలు తెలిశాయి. నా చదువుకోసం నాన్న అప్పుచేశారు. ఆ అప్పు పాపంలా పెరుగుతోంది. నాన్న స్కూలు మాష్టరుగా సంపాదించే జీతం ఇరవైరోజులకుమాత్రమే వస్తుంది. మిగతా రోజులు గంజినీళ్ళతో కడుపు నింపుకుంటున్నారు మావాళ్ళు. దారిద్ర్యానికి ప్రతి రూపంలావుంది మాఇల్లు.

అందరికీ ఒకటే ఆశ. డిగ్రీ పాసవగానే నాకొక పెద్ద ఆఫీసరు ఉద్యోగం వస్తుందని, వాళ్ళ కష్టాలు తొలగిపోతాయని ఆశిస్తూ ఆనందపడుతున్నారు.

నన్ను చూడగానే వాళ్ళ కళ్ళల్లో ఆనందం కదలాడేది. కానీ, రోజులు గడుస్తున్న కొద్దీ, నేను వుద్యోగం కోసం చేసే ప్రయత్నాలు నిష్ఫలమైపోతున్నప్పుడు, వాళ్ళ కళ్ళల్లో ఆనందం బదులు విచారం తొంగిచూసేది. వాళ్ళ ముఖంపై చీకటి తెరలు వ్యాపించేవి. అది చూస్తుంటే నాగుండెల్లో ఆవేదన రేగుతుండేది. రోజులు గడుస్తున్నాయి. నాకు ఎక్కడా కనీసం ప్యూన్ ఉద్యోగమైనా దొరకలేదు.

నాన్నగారి బాధ చూడలేక, అమ్మ, తమ్ముళ్ళు, చెల్లెళ్ళ విచారాన్ని భరించలేక, దుఃఖపడుతున్న నాకు హైదరాబాద్‌లోవున్న నా స్నేహితులు జ్ఞాపకం వచ్చారు.

నేను బీదవాడినైనా, నా స్నేహితులు చాలా గొప్పవాళ్ళు. అంతేకాదు స్నేహానికి ప్రాణం పెట్టేవాళ్ళు. నేను కాలేజీలో చదివే రోజుల్లో వాళ్ళ క్షణం కూడా నన్ను వదిలి వుండలేక పోయేవారు. నా స్నేహం కోసం తపించేవాళ్ళు.

ఇన్నాళ్ళా వాళ్ళని మరచిపోయానే అనుకున్నాను. వాళ్ళ దగ్గరకెడితే నాకేదో ఒక దారి చూపుతారు. అవును ఒక దారి తప్పక చూపుతారు.

నాన్నతో చెప్పాను. ఆయన అంగీకరించారు. నాన్న అప్పుచేసి కొంత డబ్బు యిచ్చారు. మిగిలింది అమ్మ తన మంగళ సూత్రాలు అమ్మి డబ్బు ఇచ్చింది. అది తీసుకుని ఆనందంగా హైదరాబాద్ వెళ్ళే రైలెక్కాను.

మొదట శశాంకను, తర్వాత ప్రభాకర్‌ని కలిశాను. ఆ తర్వాత కాలేజీలో నన్ను ప్రేమించి నా వెంట పడిన సుధ దగ్గరకు వెళ్ళాను. కాలేజీలో నా చూపుకోసం, మాటకోసం తపించిపోయిన వీళ్ళు, నేను వెడితే నేనెవరో తెలియనట్లుగా ప్రవర్తించారు. అంతేకాదు. నన్నూ, నా పేదరికాన్ని హేళన చేశారు. నన్ను మానసికంగా చిత్ర హింస పెట్టారు. ఎంతో ఆశతో వచ్చిన నాకు ఎన్నో ఎదురు దెబ్బలు తగిలాయి. తీరని వ్యథతో తిరిగి వెళ్ళడానికి స్టేషన్ కొచ్చాను.

కానీ, ఎక్కడికి వెళ్లను?

ఇంటికా?

నేనేదో శుభవార్త చెప్తానని ఎంతో ఆరాటంగా ఎదురుచూస్తున్న నావాళ్ళకు ఏం చెప్పను? అమ్మ, నాకేదో గొప్ప ఉద్యోగం వస్తుందని తన మెడలో మంగళ సూత్రాలు కూడా అమ్మి నాకు డబ్బు ఇచ్చింది. ఇప్పుడు నేను ఇంటికి వెళ్లి పసుపుతాడుతో వున్న అమ్మ మెడ ఎలా చూడగలను? నా తమ్ముళ్లు, చెల్లెళ్ళు నేనేదో పెద్ద ఆఫీసరునవుతానని, తమ కోర్కెలు తీరుస్తానని, కళ్ళల్లో ఆనందాన్ని నింపుకుని ఎదురు చూస్తున్నారు. నేనిలా వెళ్ళి వాళ్ళనెలా నిరాశ పరచను? అసలు నాకిక వుద్యోగమే దొరికే అవకాశమే లేదు. నిరుద్యోగిగా నా వాళ్ళముందు ఎలా నిలబడను?

అలా ఆలోచిస్తూ ప్లాట్‌ఫారమ్ మీద నిలబడ్డాను? ఇంతలో ఢిల్లీ వెళ్ళే ఎక్స్‌ప్రెస్ కూత వేసి బయలు దేరడానికి సిద్ధంగా వుంది. నేనిక ముందు వెనుక ఆలోచించకుండా రైలెక్కేశాను.

(ఇంకావుంది)

## బహుమతి పొందిన కార్టూన్ స్ట్రిప్

